ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
నారాయణపేట
జిల్లా వార్తలు
గురువారం 6 ఫిబ్రవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 21.0



మధ్యాహ్న భోజనం పెట్టడం లేదంటూ
విద్యార్థుల రాస్తారోకో
● నారాయణ పేట జిల్లా చెన్నారంలో ఘటన
● ఉపాధ్యాయురాలు, ఎంఈవోతో తల్లిదండ్రుల వాగ్వాదం
7



పెబ్బేరులోని ఓ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)



పాపం పండింది

● రైస్ మిల్లర్ల వద్ద చేతివాటం ఆరోపణలతో డీఎం ఇర్ఫాన్ సస్పెన్షన్
● ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా విచారణ
● గతంలో ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ సస్పెన్షన్
● మిల్లర్ల నుంచి భారీ మొత్తంలో డబ్బులు ముట్టిన తర్వాతే పనులు
● శాఖలో ఇంకొన్ని అవినీతి జలగలు..
● దృష్టిపెడితే వలలో పడే అవకాశం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పౌరసరఫరాల శాఖలో అవినీతి రాజ్యమేలుతోందనే విషయం మరోసారి రుజువైంది. సీఎంఆర్ ధాన్యం కేటాయింపుల నుంచి మొదలుకుని.. బియ్యం అప్పగింత వరకు ప్రతీ సందర్భంలోనూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌గా పని చేస్తున్న షేక్ ఇర్ఫాన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై గతంలో నుంచి పలు ఆరోపణలు ఉన్నాయి. కొద్దికాలంగా టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతుండగా.. ధాన్యం నిల్వల లెక్కలు, తాజా కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మహబూబ్‌నగర్ డీఎంగా పని చేస్తున్న ఇర్ఫాన్ కొన్ని నెలల క్రితమే ఇక్కడకు వచ్చారు. అంతకు ముందు వనపర్తిలో ఇన్‌చార్జి డీఎంగా విధులు నిర్వహించారు. ఈ సమయంలోనే భారీ స్థాయిలో మిల్లర్ల నుంచి ముడుపులు తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణలో తేలింది. గత బుధవారం వనపర్తి డీఎం, డీఎస్‌వోను కూడా అక్రమాల విషయంలో హైదరాబాద్‌కు పిలిపించి విచారణ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధిక వరి ఉత్పత్తి అయ్యేది జిల్లా వనపర్తి. అందుకే అక్కడే ఎక్కువ మొత్తంలో అక్రమాలు జరుగుతున్నాయి. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంఆర్ ఇవ్వని కొన్ని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టిన విషయం తెలిసిందే. అదే క్రమంలో వారికి ధాన్యం కూడా కేటాయించ లేదు. దీంతో అధికారులు ఇక్కడ కూడా చేతివాటం ప్రదర్శించారు. కొందరికి కావాలనే సీఎంఆర్ ఇవ్వకపోవడం, పక్క జిల్లాల మిల్లర్లకు సీఎంఆర్ ఇవ్వడానికి ఒక్కో మిల్లుకు రూ.రెండు లక్షల వరకు ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మహబూబ్‌నగర్ డీఎం ఇర్ఫాన్‌పై సస్పెన్షన్ వేటు వేయడం ఉలికిపాటుకు గురిచేసింది.

ఫిర్యాదు నేపథ్యం ఇలా..

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం జనుంపల్లికి చెందిన రైస్ మిల్లర్ కిరణ్‌కుమార్ రెడ్డి 2022 నుంచి

(మిగతా 6లో..)

టార్గెట్ చేరేనా?

● వ్యవసాయ మార్కెట్లకు తగ్గిన ఆదాయం
● ఫీజుల వసూళ్లలో గతేడాది కంటే వెనుకబాటు
● రూ.16.20 కోట్లకుగాను.. రూ.7.97 కోట్లు మాత్రమే రాక
● లక్ష్యంలో 49 శాతమే చేరిక
● మిగిలింది రెండు నెలలే..
● వాతావరణ పరిస్థితులతో తగ్గిన పంటల సాగు.. దిగుబడులు

మహబూబ్‌నగర్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లు ఈ ఏడాది ఆదాయంలో వెనుకపడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 10 నెలలు గడిచిపోగా, లక్ష్యంలో 49 శాతమే చేరుకోవడం గమనార్హం. అనుకూలించని వాతావరణ పరిస్థితుల కారణంగా సాగు తగ్గడం, ఫలితంగా దిగుబడులు తగ్గిపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. వచ్చిన దిగుబడులను అధికంగా దళారులు కొనుగోలు చేయడం కూడా ఒక కారణంగా చెప్పొచ్చు. గత ఏడాది లక్ష్యం రూ.12.41 కోట్లకు గాను రూ.18.29 కోట్లు రావడంతో లక్ష్యానికి మించి 110 శాతం ఆదాయం నమోదైంది. ఈ సారి ఇప్పటి వరకు సగం కూడా చేరుకో లేదు.

- పాలమూరు, (ఆంధ్రజ్యోతి)

6



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం



ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బడీడు పిల్లలతో అధికారులు(ఫైల్)

603 మందికి.. విముక్తి

● బడి బయటి బాలబాలికలను గుర్తించిన అధికారులు
● ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా దాడులు
● వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు
● రూ.74,000 జరిమానా

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో ఆరేళ్లుగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం కింద 603 మంది, ఆపరేషన్ ముస్కాన్ కింద 465 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. 18 ఏళ్ల లోపు బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా ఉంటే.. బడిలో చేర్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో బడి బయట పిల్లలను గుర్తించేందుకు గత జనవరిలో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా విస్తృతంగా దాడులు చేశారు. అందులో భాగంగా 66 మంది బాలలకు విముక్తి కల్పించారు. వారిలో 47 మంది బాలురు, 19 మంది బాలికలు ఉన్నారు. 18 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన బాలకార్మికులు ఉన్నారు. రెండు కేసులు నమోదు చేసి, 13 మంది బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులకు రూ.74,000 జరిమానా విధించారు.

ఆరేళ్లలో..

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాల్య వివాహాలను రూపుమాపేందుకు జిల్లా సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మునిసిపాలిటీ, గ్రామీణ స్థాయిలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. బడీడు పిల్లలు ఇటుక బట్టీలు, పరిశ్రమలు, హోటళ్లలో పని చేయొద్దని, యాచక వృత్తిలోకి పంపొద్దని చెబుతోంది. అలా చేస్తే అధికార యంత్రాంగం చట్టపరంగా చర్యలు తీసుకుంటోంది. ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఆకస్మిక దాడులు నిర్వహించి, బడి బయటి, బడీడు పిల్లలను గుర్తిస్తున్నారు. వివిధ పనుల్లో ఉన్న వారికి విముక్తి కల్పించి, బడి బాట పట్టేలా చర్యలు తీసుకుంటారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, కార్మిక, చైల్డ్ లైన్ భాగస్వామ్యంతో ఆపరేషన్ ముస్కాన్ కార్యాక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆరేళ్లుగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం కింద 603 మందికి, ఆపరేషన్ ముస్కాన్ కింద 465 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. గతంలో డీజీపీ మహేందర్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా ఆపరేషన్ స్మైల్ -7 బృందం ప్రశంసా పత్రాన్ని అందుకుంది.

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిది



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలి. బాలలను పనిలో పెట్టుకున్నా, తప్పిపోయిన, వది లేసిన బాల బాలికల సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 100 కాల్ చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

లక్ష్మీచెన్నకేశవ స్వామి
శకటోత్సవం
7

ఘనంగా పాల ఉట్లు

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాద్వార్ గట్టు తిమ్మప్ప, కర్నీ గుంటి రంగస్వామి జాతరలో భాగంగా బుధవారం సాయంత్రం పాల ఉట్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యువకులు పోటీ పడి ఉట్టి కొట్టారు. ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చిన్న రంగప్ప, సురేందర్, పాండు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. గుంటి రంగస్వామి బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహగౌడ్ పాల్గొన్నారు.




గుంటి రంగస్వామి ఆలయం వద్ద ఉట్టి కొడుతున్న యువకులు

దివిలో అరుణం భువిలో తారాగణం

ఆకాశం ఎర్రబడింది. సాయం సంధ్య వేళ అస్తమించిన సూర్యుడు కొండల వెనక్కి వెళ్లడంతో ఎరుపు రంగు నింగిపై ఒలికిపోయినట్లు అరుణ వర్ణంలోకి మారిపోయింది. ఇళ్లలో వేసిన లైట్లు నిశీధిలో చుక్కల్లా మెరిసిపోయాయి. మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ సాంబశివ ఆలయం వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' బుధవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్







మద్దూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో గోవిందరాజులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● నారాయణపేట డీఈవో గోవిందరాజులు

మద్దూరు/కోస్గి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని నారాయణపేట డీఈవో గోవిందరాజులు అన్నారు. బుధవారం మద్దూర్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న రివిజన్ టెస్ట్, ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. పరీక్షల సమయం అమూల్యమైందని, వృథా చేయొద్దని చెప్పారు. బాగా చదివి, మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు అందుతున్న స్నాక్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. కోస్గి జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుండుమాల్ జడ్పీహెచ్ఎస్‌లను తనిఖీ చేశారు.

దివ్యాంగుల సమస్యలు
పరిష్కరించాలి

● కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలకు సంబంధించి ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. అందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, డీఎస్పీ జి.రమణా రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్, అదనపు డీఆర్‌డీవో జోజప్ప, ఎల్‌డీఎం కె.భాస్కర్, డీఎంహెచ్‌వో లక్ష్మి, విద్యా శాఖ ఏడీ కేపీ అనురాధ, పీడబ్ల్యూడీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

సాయుధ పోరాటంలో పాటే ఆయుధం

● సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

7

బావిలో పడి గొర్రెలకాపరి మృతి

● చంద్రప్పతండాలో ఘటన

7

రాష్ట్రాలు వేరైనా తెలుగు జాతి ఒక్కటే

» మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



అయిజ మండలం ఉత్తనూర్‌లో పశుబల ప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

అయిజ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు వేరైనా తెలుగు జాతి ఒక్కటే అని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఉత్తనూర్‌లో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పశుబల ప్రదర్శన న్యూ కేటగిరీ విభాగం పోటీలను బుధవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతు సంబురాలను ఏర్పాటు చేయటం అభినందించదగ్గ విషయమన్నారు. అన్నదమ్ముల్లా కలిసి పండుగలు, ఉత్సవాలు నిర్వహించుకుందామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనటానికి పది జతల ఎద్దులు వచ్చాయి. కార్యక్రమంలో మంత్రాలయం మాజీ ఎమ్మెల్యే గౌరు వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఆముదం సాగు

» వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి



కొండారెడ్డిపల్లిలో ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి

వంగూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిని బుధవారం పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆముదం విభాగం శాస్త్రవేత్తలు నళిని, సాదయ్య, ఈశ్వర్‌రెడ్డి, దివ్యరాణి, మాధవి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి సందర్శించారు. క్షేత్ర దినోత్సవంలో భాగంగా రైతు రాములు సాగు చేసిన ఆముదం పంటను వారు పరిశీలించారు. పరిశోధన స్థానం నుంచి విడుదల చేసిన ఆముదం సంకరం ఐసీహెచ్-5ని రైతులు సాగు చేశారు. ఆముదం, ఇతర ముఖ్యపంటలలో రకాలు, సాగు, సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ.. రైతులు తక్కువ పెట్టుబడితో సాగుచేసే ఆముదం పంటను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ప్రియదర్శిని, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ



పీజీ కళాశాలకు వచ్చిన నూతన విద్యార్థులతో అధ్యాపకులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ కొల్లాపూర్‌లో ఫ్రెషర్స్ పార్టీని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగత సభను ఏర్పాటు చేశారు. కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మార్కోపోలోనియస్ మాట్లాడుతూ.. కొల్లాపూర్‌లో పర్యాటక ప్రాంతం చాలా అద్భుతంగా ఉంటుందని, విద్యార్థులకు చదువుకోవడానికి చక్కని ప్రదేశంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీ ఫార్మసీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో బీ ఫార్మసీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను బుధవారం వీసీ జీఎన్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత హాజరు, గైర్హాజరు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ప్రశ్నాపత్రంలో సిలబస్ ప్రకారంగా వచ్చాయో లేదో సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పొట్టేళ్లు ఢీ అంటే ఢీ



తొత్తినోనిదొడ్డిలో తలబడుతున్న పొట్టేళ్లు

అయిజ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని తొత్తినోనిదొడ్డిలో బుధవారం గుండ్ల భీమరాయుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా పొట్టేళ్ల పోటీలను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి 9 పొట్టేళ్లు పాల్గొన్నాయి. అందులో అయిజకు చెందిన నర్సింహా పొట్టేలు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. రాయలసీమ డోన్‌కు చెందిన రమేష్ పొట్టేలు ద్వితీయ, ఎర్రబాడు గ్రామం మచ్చకు చెందిన రాయన్‌గ్రూప్ పొట్టేలు మూడవ స్థానాన్ని, హైదరాబాద్‌కు చెందిన ఖాన్ పొట్టేలు నాలుగవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

బెల్టు షాపులుగా హోటళ్లు

» బయట భోజనం బోర్డులు, లోపల సిట్టింగులు



వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డు వైపు సిట్టింగ్ నిర్వహిస్తున్న ఓ భోజనం హోటల్

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొన్ని నెలలుగా మద్యం అమ్మకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పేరుకే బయట హోటల్ అనే బోర్డును పెట్టి.. లోపలికి వెళ్లాక మద్యం అమ్మకాలు, సిట్టింగులతో కళకళలాడుతుంది. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌పైనే సంబంధిత ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి, పట్టించుకోకపోవడంతో జిల్లాలో బెల్టు షాపులు బార్లను తలపిస్తున్నాయి. మద్యం దుకాణాల యజమానులతో బెల్టు షాపుల నిర్వాహకులు సిండికేట్‌గా మారి ప్రతి నెల లక్షల్లో ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు అందజేస్తున్నారు.

అనుమతి లేకుండా మద్యం విక్రయించొద్దు

జిల్లాలో బెల్టు దుకాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఎవరైనా బెల్టు దుకాణాలలో మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భోజనం హోటళ్లలో ఎక్కడైనా మద్యం విక్రయిస్తున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి ఉంటే ప్రజలు ఫిర్యాదు చేయాలి.

- శ్రీనివాసులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ప్రతీ గ్రామానికి ఐదు బెల్టు షాపులు

జిల్లాలో అనుమతులు ఉన్న మద్యం దుకాణాల కన్నా పదింతలు ఎక్కువగా బెల్టు షాపులు ఉన్నాయి. జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఐదు బెల్టు షాపులపైనే వెలిశాయి. ఈ దందా అంతా ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే నడుస్తుందనేది ప్రధాన ఆరోపణ. అడ్డగోలుగా ఫుల్ బాటిల్‌పై రూ.200 నుంచి 300, బీర్‌పై రూ.20 నుంచి రూ.30 తీసుకుని విక్రయిస్తున్నారు. పలుమార్లు గ్రామాల్లోని యువత, విద్యావంతులు ఈ విషయంపై ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

హోటళ్ల పేరిట సిట్టింగులు

వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, అమరచింత, ఆత్మకూరు పట్టణాల్లో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన మద్యం దుకాణానికి సమీపంలోని వారి పరిధిలో భోజనం హోటల్స్ పేరిట ఏర్పాటు చేసి ఎక్సైజ్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుని సిట్టింగులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయంపై ఆ చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు సంబంధిత ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్న కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పాపం పండింది

(5వ పేజీ తరువాయి..)

సీఎంఆర్ పొందుతున్నారు. గత జూలైలో కూడా సీఎంఆర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ సీఎంఆర్ కేటాయించాలంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. జూలై 24న డీఎం ఇర్ఫాన్ ఆదేశాలతో షనవాజ్ ఖాన్ అనే వ్యక్తికి రూ.50 వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. దాని స్క్రీన్‌షాట్‌ను విచారణ అధికారులకు అప్పగించారు. అలాగే ఖిల్లాఘణపురానికి చెందిన బాలాజీ రైస్‌మిల్లులో తనిఖీలు చేసిన డీఎస్‌వో కాశీ విశ్వనాథ్, డీఎం ఇర్ఫాన్ 2023-2024 వానాకాలం సీజన్‌కు సంబంధించి రూ.80 వేల బ్యాగులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత క్రిమినల్ కేసు బుక్ చేయకుండా ఉండేందుకు రూ.నాలుగు లక్షలు డిమాండ్ చేసి.. తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ మిల్లును విజిట్ చేసినా ఇదే తరహాలో ఇవ్వడంతో తాను కూడా ఇచ్చానని యజమాని రమేష్ ఉన్నతాధికారులకు తెలిపారు. చిన్నంబావి మండలంలోని వెలగొండకు చెందిన సప్తగిరి రైస్ మిల్లులో గత సంవత్సరం అక్టోబరులో తనిఖీలు నిర్వహించిన ఇర్ఫాన్.. 40 వేల బ్యాగులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేయకుండా ఉండటం కోసం రూ.10 లక్షలు డిమాండ్ చేసి, మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యే 10 రోజుల ముందు తీసుకున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సీఎంఆర్‌ను తీసుకోవడంలో కూడా వాటిని పాస్ చేయాలంటే ప్రతీ ఏసీకే బియ్యానికి రూ.5 వేల వరకు డిమాండ్ చేశారని ఆరోపించారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని విచారణ చేసిన కమిషనర్.. సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌లో ఉన్నంత వరకు ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లరాదని ఆదేశాల్లో పేర్కొన్నారు.

గతంలో రెండుసార్లు సస్పెండ్..

ఇర్ఫాన్ వనపర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు బదిలీ ఉత్తర్వులు వచ్చినా రిలీవ్ కాకుండా కొనసాగారు. వచ్చిన అధికారినే తిరిగి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి'లో పౌరసరఫరాల శాఖలో దుమారం శీర్షికన కథనం ప్రచురించడంతో ఆ తర్వాత రోజునే రిలీవ్ అయ్యి, మహబూబ్‌నగర్‌లో జాయిన్ అయ్యారు. అయితే డీఎం ఇర్ఫాన్ గతంలోనూ రెండు సార్లు సస్పెండ్ అయినట్లు ఆయన సర్వీసు బుక్ చెబుతోంది. 2012లో ఆయన ఆదిలాబాద్‌లో పని చేస్తున్నప్పుడు పీడీఎస్ గోధుమలు 581.250 క్వింటాళ్లు పక్కదారి పట్టించి.. బ్లాక్ మార్కెట్‌కు తరలించినందుకు అక్కడి జేసీ సస్పెండ్ చేశారు. ఒక ఇంక్రిమెంట్ నిలిపివేయడంతోపాటు రూ.1.97 లక్షలను రికవరీ చేశారు. సస్పెన్షన్ పీరియడ్‌ను విధుల్లో లేనట్లుగా గుర్తించారు. ఆ తర్వాత 2022లో వరంగల్‌లో పని చేస్తున్నప్పుడు పౌరసరఫరాల కమిషనర్ ఇచ్చిన టార్గెట్ల కంటే మిల్లర్ల నుంచి 29,939 మెట్రిక్ టన్నుల ఎక్కువ సీఎంఆర్‌ను అనుమతించినందుకు కలెక్టర్ సస్పెండ్ చేశారు. తాజా సస్పెన్షన్ ఇర్ఫాన్‌కు మూడో సారి. అయితే ఒక్క ఇర్ఫానే కాకుండా పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న వారిలో ఇంకొన్ని అవినీతి జలగలు ఉన్నాయని, లోతుగా విచారణ చేస్తే మరింత మందికి బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొందరు ఫారన్ సర్వీస్ ఐదు సంవత్సరాలు ఉంటే.. ఆ గడువు పూర్తయినా అక్కడే తిష్ట వేసుకుని పనిచేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

టార్గెట్ చేరేనా?

» వ్యవసాయ మార్కెట్లకు తగ్గిన ఆదాయం



మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో వేరుశనగ రాశులు (ఫైల్)

పాలమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ మార్కెట్ల ఆదాయం తగ్గుముఖం పట్టింది. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. రబీలో సాగు తగ్గడం, ఉత్పత్తులు అదే స్థాయిలో తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్లు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కనిపించడం లేదు. 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలోని మహబూబ్‌నగర్, బాదేపల్లి, దేవరకద్ర, బాలానగర్, నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ల నుంచి రూ.16 కోట్లా 20 లక్షలా 40 వేల ఆదాయం గడించాలని టార్గెట్ నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు రూ. 7 కోట్లా 97 లక్షలా 11 వేలు మాత్రమే ఆదాయం వచ్చింది. ఆర్థిక సంవత్సరంలో పది నెలలు పూర్తి కాగా, రెండు నెలలే మిగిలి ఉంది. ఈ తరుణంలో లక్ష్యంలో 49 శాతం మాత్రమే ఆదాయం రావడం, మిగిలిన రెండు నెలల్లో నిరాశజనక పరిస్థితులు కనిపిస్తుండటంతో ఈయేడాది ఆదాయంలో భారీలోటు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గతేడాది కంటే తగ్గిన ఆదాయం

జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజుల ద్వారా రూ.16.20 కోట్ల ఆదాయం గడించాలని లక్ష్యంగా నిర్ధారించారు. ఇప్పటి వరకు రూ.7.97 కోట్ల ఆదాయం అంటే 49 శాతం మాత్రమే నమోదైంది. గత ఏడాది రూ.12.14 కోట్ల ఆదాయం గడించాలని టార్గెట్ నిర్ణయించగా, రూ.18.29 కోట్లకు పైగా వచ్చింది. 100కు 110శాతం ఆదాయం వచ్చింది. ఈసారి మాత్రం పరిస్థితి తలకిందులైంది.

వార్షిక టార్గెట్ కష్టమేనా?

ప్రతికూల వాతావరణం వల్ల ఈయేడాది జిల్లాలో పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయాయి. వానాకాలం సీజన్ ఆరంభంలో అధిక వర్షంతో వరి, మొక్కజొన్న, పత్తి సాగు ఆలస్యం కావడంతో.. దిగుబడులు తగ్గాయి. వానాకాలంలో ప్రధానంగా పండే ఈ పంటల ఉత్పత్తులు ఆశించిన రీతిలో లేకపోవడం, ముందస్తు రబీగా సాగయ్యే వేరుశనగ సాగు తగ్గిపోవడంతో ఆ ప్రభావం మార్కెట్లపై పడింది. మార్కెట్లలో ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేకపోవడంతో మార్కెట్ ఫీజు రాబడి తగ్గిందని తెలుస్తోంది. ప్రస్తుత లెక్కల ప్రకారం మార్కెటింగ్‌శాఖ టార్గెట్ ప్రకారం మార్చి నెలాఖరు వరకు నిర్దేశిత లక్ష్యంలో ఇంకా 51 శాతం అంటే రూ.823 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. ప్రస్తుత సాగు పరిస్థితులను పరిశీలిస్తే ఆ ఆదాయం రావడం గగనమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంవత్సరానికి మరో రెండు నెలలే గడువు ఉంది. వానాకాలంలో పండిన పంటలు రైతులు దాదాపుగా అమ్ముకోవడం, అందులో కూడా చాలా మంది దళారులే కొనడం, మిగిలిన రెండు మాసాల్లో మార్కెట్లకు ఆదాయ మార్గమైన వేరుశనగ దిగుబడులు తగ్గడం, యాసంగిలో వరిసాగు గణనీయంగా పడిపోవడంతో లక్ష్యం మేర ఆదాయం రావడం సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

ఈ ఏడాది లక్ష్యం పూర్తి చేస్తాం



మహబూబ్‌నగర్ జిల్లాలో మార్కెట్ల ఆదాయం ఈ ఏడాది లక్ష్యం పూర్తి చేస్తాం. గతేడాది మహబూబ్‌నగర్ లక్ష్యం రూ.12.41కోట్లకు రూ.18.29కోట్లు వచ్చింది. 110 శాతం పూర్తి చేశాం. ఈ ఏడాది లక్ష్యం రూ.16.20కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ. 7.97కోట్లు, 49 శాతం వచ్చింది. మార్చి వరకు పూర్తవుతుందనే నమ్మకం ఉంది.

- బాలమణి, జిల్లా మార్కెటింగ్ అధికారి

మత్స్య సంపద దోపిడీ



కృష్ణానది తీరాన ఏర్పాటు చేసుకున్న ఇతర రాష్ట్రాల కార్మికుల స్థావరాలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో చేపల మాఫియా పెట్రేగిపోతోంది. నిషేధిత అలవి వలలతో మత్స్యసంపదను దోచుకుంటున్నారు. దోమతెర కంటే సన్నటి రంధ్రాలు ఉన్న వలలు వాడడం వల్ల చిన్న చేప పిల్లలు సైతం అందులో చిక్కుతున్నాయి. చివరికి చేప గుడ్లను కూడా ఈ వలలో లాగేస్తుండడంతో రోజు రోజుకు కృష్ణా నది మత్స్య సంపద తగ్గిపోతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కొల్లాపూర్, పెంట్లవెల్లి, చిన్నంబావి మండలాల్లో కృష్ణానది తీరాన ఉన్న సోమశిల, అమరగిరి, మల్లేశ్వరం, మంచాలకట్ట, చెల్లెపాడు, చీమల తిప్ప వరకు కృష్ణానది తీరాన ఎత్తైన గుట్టలపై తిప్పలపై ఆంధ్ర జాలర్లు స్థావరాలు ఏర్పాటు చేసుకుని అలవి వలలతో మత్స్య సంపదను దోచేస్తున్నారు. మత్స్యకారులు జీవనోపాధి కోసం రాష్ట్ర మత్స్యశాఖ లక్షల సంఖ్యలో చేప పిల్లలను నదిలో వదిలాక ఫిషింగ్ మాఫియా అలవి వలలతో నదిలో నుంచి మొత్తం చేప పిల్లలను తోడేస్తున్నారు.

మార్కెట్‌లో చిన్న చేప పిల్లలకు డిమాండ్

బహిరంగ మార్కెట్లో చిన్న చేప పిల్లలకే డిమాండ్ ఉండడంతో చేపల మాఫియా నిషేధిత అలవి వలలతో వేట సాగిస్తు లక్షలు గడిస్తున్నారు. ఒకసారి నదిలో అలవి వలతో చేపల వేట సాగిస్తే సుమారు 10 నుంచి 20 క్వింటాళ్ల వరకు చేప పిల్లలు చిక్కుతాయి. ఇందులో సగం వరకు చిన్న చేపలే ఉంటాయి. వీటిలో బేర్షలు, పొట్టు, మోసు, బట్ట, గండే రకాల చిన్న చేపలు ఉంటాయి. వీటిని ఔషధాలు, కాస్మోటిక్‌లలో ఉపయోగిస్తారు. వాటిని నదీతీరా ఒడ్డున ఆరబెట్టి తెలంగాణ నుంచి ఆంధ్రాలోని విజయవాడకు రవాణా చేస్తారు. కృష్ణానది తీరంలో అలివి వలలతో వేటాడిన చేప పిల్లలను ఎండబెట్టి సంచుల్లో నింపి పడవల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నందికొట్కూరు నియోజకవర్గంలోని నదీ తీర పల్లెలకు, హైదరాబాద్, ముంబాయి విక్రయిస్తూ చేపల మాఫియా సొమ్ము చేసుకుంటుంది.

గత నెల 27వ తేదీన బాలకార్మికులతో కృష్ణానది తీరంలో నిషేధిత వలతో చేపలు పడుతున్నారని స్థానిక యువకులు లేబర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు స్పందించి తనిఖీ చేసి 7 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. వీరిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు స్పందించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చేపల మాఫియాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

రోలర్ స్టాంప్ పరికరానికి పేటెంట్



అధ్యాపకుడు మధుని అభినందిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని గణితశాస్త్రం విభాగం అధ్యాపకుడు మధు తయారు చేసిన రోలర్ స్టాంప్ పరికరంపై పేటెంట్ హక్కులు సాధించారు. బుధవారం పీయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వీసీ జీఎన్ శ్రీనివాస్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. గణితం అంటే భయపడే బాలబాలికల కోసం రోలర్ స్టాంప్ పరికరం అద్భుతమైన శిక్షణ సాధనంగా పని చేస్తుందని తెలిపారు. ఈ పరికరం పిల్లలు సంఖ్యలను గుర్తించడం, జ్ఞాపకం పెంచడంలో సహాయం చేస్తుందన్నారు. ఈ పరికరాన్ని ఉపయోగించి జోడింపు, తీసివేతలు, విభజన వంటి మౌలిక గణిత ఆపరేషన్లను ప్రదర్శించవచ్చునని వివరించారు. పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో విస్తృత పరిశోధనలు చేయాలి

» పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫార్మా రంగంలో విస్తృత పరిశోధనలు చేయాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం వీసీ చాంబర్‌లో ఫార్మసీ కళాశాల విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్లోబల్ రెగ్యులేటరీ నియమ నిబంధనలు, అడ్వాన్స్ టాపిక్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మస్యూటికల్ నూతక పోకడలను, వ్యవహారాల సార్వత్రిక దృష్టిలో సంక్లిష్టంగా ఉన్న పరికరాలను పరిష్కరించడానికి సంపూర్ణమైన వనరును అందిస్తుందని తెలిపారు. కొత్త మందులు మార్కెట్‌లోకి తీసుకురావడంలో వివిధ దశల నుంచి పోస్ట్ మార్కెటింగ్ సర్వీలెన్స్ వరకు క్లీనికల్ డ్రగ్ అభివృద్ధి గురించి అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ బుక్స్ లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. పుస్తకాన్ని రచించిన ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప, వీసీ ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని అకాడమిక్ బ్లాక్‌లోని ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్త డాక్టర్ కళ్యాణ్ కాల్వా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) అనేది కంప్యూటర్ డేటాను చూడటం, మార్చగల సామర్థ్యంతో సహా అనేక అధునాతన విధులను నిర్వహించడానికి వీలు కల్పించే సాంకేతికతల సమితి అని వివరించారు. ఏఐ సిస్టమ్ పెద్ద మొత్తంలో లేబుల్ చేయబడిన శిక్షణ డేటాను తీసుకోవడం ద్వారా పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్ రాష్ట్రాల గురించి అంచనాలను రూపొందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అర్జున్ కుమార్, నాగసుధ, అరుంధతిరెడ్డి, జావీద్ ఖాన్, విజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా ఉద్యమించాలి

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి

పాలమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి దళితులు ఐక్యంగ ఉద్యమించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ప్రకటన చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను ఆమోదించిన తర్వాత ఈ సమస్యకు తార్కిక ముగింపుకు చేకూరినట్లు పేర్కొన్నారు. 30 ఏళ్లకు మించి సాగిన ఉద్యమం, అనేక త్యాగాలతోనే ఇది సాధ్యమైనట్లు తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చొరవ చేసినట్లు.. ఎస్టీ వర్గీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. వీరిలో ఆదివాసులు చాలా నష్టపోతున్నారని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో చెంచులకు జరిగిన నష్టం కొన్ని తరాల జీవన భవిష్యత్తును భంగపరిచినట్లు తెలిపారు. ఇక నుంచి దళితులు, ఆదివాసులు సహజ వనరులతో సామాజిక సంపదలో తమ వాటా కోసం ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

ఫేక్ ఐడీతో రూ.1.70లక్షలు మోసం

జడ్చర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఫేక్ ఫేస్‌బుక్ ఐడీతో మెసేజ్ చేసి డబ్బులు కాజేసిన ఘటన గతేడాది డిసెంబరు 29న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించిన వివరాలిలా.. పట్టణానికి చెందిన సయ్యద్ షమీమొద్దీన్ అన్న కుమారుడు అక్బర్ షరీఫ్‌బాబర్ యూకేలో ఉంటున్నాడు. అతని పేరుతో ఫేస్‌బుక్‌లో కొందరు సైబర్ నేరగాళ్లు ఫేక్ ఐడీ తయారు చేశారు. షమీమొద్దీన్‌కు ఫేస్‌బుక్ ద్వారా మెసేజ్ పంపి, యూకేలో పాస్‌పోర్టు వ్యాలిడిటీ పూర్తయ్యిందని, పోలీసులు పట్టుకుని జైలుకు పంపుతున్నారని, రూ.2లక్షలు పంపించాలంటూ మెసేజ్‌లో పేర్కొన్నాడు. నమ్మిన షమీమొద్దీన్ విడతల వారీగా ఆన్‌లైన్ ద్వారా రూ. 1.70లక్షలు పంపించాడు. అనంతరం అక్బర్ షరీఫ్‌కు ఫోన్ చేసి విచారించాడు. ఎవరూ అరెస్ట్ చేయలేదని, మోసం జరిగిందంటూ వెల్లడించడంతో వెంటనే సైబర్‌క్రైమ్‌కు, బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సింగోటం ఆలయ హుండీ లెక్కింపు

» రూ.15.28లక్షల నగదు, 2 కిలోల వెండి



నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ ఎస్వీకే కేబీ ఆదిత్య లక్ష్మారావు, ఈవో రంగారావు పర్యవేక్షించారు. లెక్కింపులో రూ.15,28,330 నగదు, 2,270 గ్రాముల వెండి వచ్చిందని ఈవో వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టడం లేదంటూ

విద్యార్థుల రాస్తారోకో

» ఉపాధ్యాయురాలు, ఎంఈవోతో తల్లిదండ్రుల వాగ్వాదం


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కోస్గి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పెట్టడంలేదంటూ విద్యార్థులు రాస్తారోకో చేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని చెన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కోస్గి-నారాయణపేట రహదారిలో బుధవారం రాస్తారోకో చేశారు. తమకు మధ్యాహ్న భోజనం పెట్టలేమని, ఇంటి నుంచి అన్నం తెచ్చుకోమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయురాలితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న మండల విద్యాధికారి శంకర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులను రోడ్డుపై నుంచి పాఠశాలలోకి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు విద్యాశాఖ అధి కారితో సైతం వాగ్వాదానికి దిగారు. సముదాయించి ప్రధానోపాధ్యాయురాలు అ న్నపూర్ణను డిప్యూటేషన్‌పై ఇక్కడి నుంచి మరో పాఠశాలకు పంపుతామని, ఇక్క డికి మరో ఉపాధ్యాయున్ని ఇస్తామని, విద్యార్థులకు నిత్యం భోజనం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి జానకి

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలలో కక్షిదారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని వనపర్తి రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జానకి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలల న్యాయ స్థానం బాలల సంక్షేమ సమితి కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కక్షిదారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు విపత్తులో ఉన్న బాధితులు మూడు లక్షల రూపాయలు సంవత్సర ఆదాయం ఉన్న వారికి ఉచిత న్యాయ సేవలు అమలవుతున్నాయని వివరించారు. ఉచిత న్యాయ సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించాలని, ఉచిత న్యాయ సేవలతో కక్షిదారులకు ఆర్థిక ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఏపీపీ రాజేష్, కృష్ణయ్య, సఖి కేంద్రం లీగల్ కౌన్సిల్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాంబాబు, బాలల సంక్షేమ సమితి సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, మధు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందిపాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తకోట/అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ బైపాస్‌లోని మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పాన్‌గల్ మండల రేమద్దుల గ్రామానికి చెందిన నరసింహారెడ్డి విలియంకొండ గ్రామంలో జరిగిన శుభకార్యంలో పాల్గొని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తూ జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. గాయపడిన నరసింహారెడ్డి (55)ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

కంటైనర్ వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు


ముమ్మళ్లపల్లి గ్రామ శివారులో బోల్తా పడిన కంటైనర్ వాహనం

కొత్తకోట మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామ శివారు జాతీయ రహదారిపై కంటైనర్ వాహనం బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన చోటు చేసు కుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు పార్శిళ్లను తీసుకొని వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లి బోల్తాపడింది. డ్రైవర్ రవి, క్లీనర్ మహేంద ర్‌లకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి..

అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామ శివారులోని ఇటుకబట్టీల వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మీద పడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడింపల్లి గ్రామ శివారులో మల్లయ్య ఇటుక బట్టీల వద్ద అయిజ గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి కూలీ పనిచేస్తున్నాడు. బుధవారం ఇటుక బట్టి మట్టిని ట్రాక్టర్‌తో కలుపుతుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో మట్టిలో కురుకుపోయింది. గమనించిన స్థానికులు ఎక్స్‌కవేటర్ సహాయంతో వెంటనే అతడిని తీసి ఆసుపత్రికి తరలించారు. శివకు తీవ్రగాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులను వివరణ కోరగా సమాచారం అందింది. ప్రస్తుతం కేసు నమోదు కాలేదని ఎస్సై రమేష్ తెలిపారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 26వేలు విలువైన 16 బాటిళ్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం వివిధ బస్సులు, వాహనాలు తనిఖీలు చేస్తుండగా గోవా విహార యాత్ర నుంచి వస్తున్న యాత్రికులు బ్యాగ్ తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు వారు అన్నారు. బాటిళ్లు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వారు అన్నారు.

దగ్ధమైందా? దహనం చేశారా?

» బాదేపల్లి పత్తి మార్కెట్ దారిలో సీసీ రోడ్డుపై ద్విచక్ర వాహనం

జడ్చర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారి నుంచి బాదేపల్లి పత్తి మార్కెట్‌కు వెళ్లే సీసీ రోడ్డుపై ఓ ద్విచక్రవాహనం దగ్ధం అయ్యి ఉన్నది. బుధవారం మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కార్యదర్శి నవీన్ కంట పడింది. ద్విచక్రవాహనం దగ్ధం అయ్యిందా... లేక దహనం చేశారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటన స్థలంలో ఎవరూ లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ సంఘటనపై జడ్చర్ల పోలీసుల దృష్టికి మార్కెట్ అధికారులు తీసుకెళ్లారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

అమరచింత, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నీళ్లు తాగడానికి వెళ్లిన గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని చంద్రప్ప తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలం మద్దూరు గ్రామానికి చెందిన గొల్ల నాగరాజు కుమారుడు గొల్ల కురుమూర్తి (15) రోజు వారీగా గొర్రెలను మేపడానికి బుధవారం అమరచింత మండల పరిధిలోని చంద్రప్ప తండా శివారులోని వ్యవసాయ పొలాల వద్దకు వచ్చాడు. గొర్రెలను మేపే క్రమంలో దాహం వేయడంతో కురుమూర్తి, గోపాల్ నాయక్ వ్యవసాయ బావిలో నీళ్లు తాగడానికి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. దీంతో కురుమూర్తికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగినట్లు తెలిసింది. తండ్రి గొల్ల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టంకు పంపినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అందివచ్చిన అమృతం

● గద్వాలకు వరం అమృత్-2 పథకం

» రూ.63.25కోట్లతో తాగునీటి పథకం
» నదీ అగ్రహారం వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
» పట్టణంలో 100కిలో మీటర్ల మేర పైపులైన్లు
» కొత్తగా 5 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
» రెండేళ్లలో పూర్తి కానున్న ప్రాజెక్టు


నదీ అగ్రహారంలోని మొదటి మంచినీటి ఫిల్టర్ బెడ్

గద్వాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణం దినదినాభివృద్ధి చెందుతున్నది. దానికితోడు ఉపాధి, ఉన్నత చదువుల నిమిత్తం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు చేరుతున్న కుటుంబాల సంఖ్య పెరగడంతో పట్టణ జనాభా కూడా పెరుగుతూ వస్తోంది. దీంతో గద్వాలకు సరఫరా చేస్తున్న మంచి నీరు ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రతీ రోజు 15ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్‌డే) అవసరం కాగా ప్రస్తుతం 12.6ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతున్నది. ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. వార్డులలో నీటి కష్టాలను తీర్చేందుకు 171 స్థానిక బోర్లకు మోటార్లు బిగించి సరఫరా చేస్తున్నా కష్టాలు తప్పడం లేదు. వేసవి కాలంలో ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిలో అమృత్-2 పథకం మంజూరు కావడం గద్వాల పట్టణ ప్రజలకు వరం లాంటింది.

రూ.63.25 కోట్లతో పథకం అమలు ఇలా..

అమృత్-2 పథకం గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతుంది. 2021-26 మధ్య దేశంలోని 500పట్టణాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల గృహాలకు 100 శాతం మంచినీటి సరఫరాను కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన పథకం అమృత్-2. గద్వాలలో రూ.63.25కోట్లతో పథకాన్ని అమలు చేస్తున్నది. కేంద్రం ప్రభుత్వం రూ.28.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.34.50కోట్లను భరిస్తాయి. ఇందులో నదీ అగ్రహారం వద్ద 5ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తారు. అదేవిధంగా కృష్ణానది రోడ్డులో 600కేఎల్, బీసీ కాలనీలో 1000 కేఎల్, మార్కెట్ యార్డులో 500 కేఎల్, మోమిన్‌మహిళ వార్డులో 600కెఎల్, డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర 1000 కేఎల్ రిజర్వాయర్లను నిర్మిస్తారు. విలీన గ్రామాలతో పాటు విస్తరణ కాలనీలలో కొత్తగా పైపులైన్లు, 30ఏళ్ల క్రితం వేసిన పాతపైపు లైన్ల స్థానంలో కొత్తవి ఇలా దాదాపు 100కిలోమీటర్ల పొడవున పైపులైన్లను నిర్మించడంతో పాటు 4,200 కుటుంబాలకు కొత్తగా మంచినీటి కనెక్షన్‌లు ఇస్తారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది.

ప్రస్తుతం మూడు పథకాలతో సరఫరా..

గద్వాల పట్టణ ప్రజలకు మూడు పథకాల ద్వారా దాహార్తిని తీరుస్తున్నారు. ఇందులో కృష్ణానది నుంచి 1972లో పాగా పుల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉండి సీఎంగా ఉన్న పీవీ నరసింహారావుచే శంకుస్థాపన చేయించిన గద్వాల వాటర్ సప్లయ్ స్కీం. ఇది మూడేళ్లలో పూర్తయి 1975 ఆగస్టు 10వ తేదీ నుంచి గద్వాల ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుంది.

అయితే పట్టణ జనాభా పెరగడంతో 2000 సంవత్సరంలో గట్టు భీముడు ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జములమ్మ రిజర్వాయర్ నుంచి మరో పథకాన్ని ప్రారంభించారు. కొరత లేకుండా నీటి నిల్వలు ఉంచేందుకు 2008లో డీకే అరుణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేశారు. అయినప్పటికీ తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో 2022 నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా దాదాపు 18 వార్డులకు నీటి సరఫరా చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న 66వేల జనాభాకు ఈ తాగునీటి పథకాలు సరిపోయేవి. కానీ ఇప్పుడు జనాభా దాదాపు 90వేలు దాటి లక్షకు చేరువలో ఉన్నది. దానికితోడు నాలుగు గ్రామాలు విలీనం అయ్యాయి. మూడు పథకాల ద్వారా కూడా నీటి ఎద్దడి ఏర్పడుతూనే ఉంది.

అందుకే అమృత్-2 పథకం ప్రారంభం అయితే 2053 వరకు గద్వాలకు నీటి సమస్య ఉండదని అధికారులు అంటున్నారు.

పథకం సరే.. సీసీ రోడ్ల పరిస్థితి ఏమిటి?

అమృత్-2 పథకం గద్వాలకు వరం లాంటిదే.. కానీ సీసీరోడ్ల పరిస్థితి ఏమిటీ..? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. 1975లో ఏర్పడిన మొదటి మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి నీటి సరఫరా అందించేందుకు 50ఏళ్ల క్రితం పాత గద్వాల పట్టణంలో పైపులైన్లు వేశారు. ఇప్పుడు ఆ పైపులైన్లు దాదాపు 6నుంచి 8ఫీట్ల లోతుల్లో ఉన్నాయి. వీటి ద్వారా పైకి ఫోర్స్‌తో నీళ్లు రాకపోవడంతో చాలా మంది నేరుగా మోటార్లను బిగించారు. ఇప్పుడు ఆ పైపులైన్ల స్థానంలో దాదాపు 100కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్లు వేయడానికి అనుమతులు వచ్చాయి. అయితే గత మునిసిపల్ కౌన్సిల్ దాదాపు రూ.30 కోట్లను ఖర్చు చేసి కొత్తగా సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించింది. పైపు లైన్లు వేయాలంటే సీసీని తొలగించాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ పథకంలో గ్రామాల్లో ఇలానే చేశారు. ఇప్పుడు ఈ పథకంలో అదే పరిస్థితి ఉంది. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 2 శాతం తొలగించిన సీసీ రోడ్ల మరమ్మతులకు కేటాయించారు. ఇవి వాటి మరమ్మతులకు ఏమాత్రం సరిపోవు. ఇంజనీరింగ్ అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే తప్ప గత కౌన్సిల్ చేసిన అభివృద్ధి కొంతకాలం కనిపించే అవకాశం ఉంది.

సాయుధ పోరాటంలో పాటే ఆయుధమైంది

» సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో విప్లవ సాహితీవేత్తల పాటలే ఆయుధమయ్యాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలకు ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుద్దాల హనుమంతు కవిగా, కళాకారుడిగా, వాగ్గేయకారుడిగా సాయుధ పోరాటంలో స్ఫూర్తి నింపారన్నారు. అతడి కలం నుంచి జాలువారిన (పల్లెటూరి పిల్లగాడ... పసుల కాసే మొనగాడ.. పాలు మరిచి ఎన్నాళ్లయిందో..?) అనే పాట నేటికీ ప్రజల గొంతుకలలో వినిపిస్తుందన్నారు. తన జీవితమంతా కష్టజీవుల కోసం అంకితం చేసిన గొప్ప వ్యక్తి సుద్దాల హనుమంతు అని కొనియడారు. జాతి యావత్తుని తన కవిత లతో మేల్కొపిన మహాకవి సుద్దాల అన్నారు. ఆయన కవిత్వంలో ఆవేశం, ఆలోచన ఉంటుందన్నారు. ఆ అర్థాలలో సామాజిక స్పృహ ఉంటుందన్నారు. నేటి కాన్వెంట్ విద్యార్థులకు ఆయన జీవిత చరిత్ర తెలియపర్చడం ఎంతో సంతోషకరమన్నారు. జనపద కళలు, నాటకాలు, చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం, కోలాటా పోటీలు నిర్వహించడం ద్వారా అంతరించిపోతున్న మన ప్రాచీన కళలను కాపాడుకోవడమే కాకుండా మహనీయుల చరిత్ర నేటి తరానికి పరిచయం చే సినట్లు అవుతుందన్నారు.

ఈ సందర్భంగా 'సుద్దాల హనుమంతు జీవిత సాహిత్యం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. నమీబియ దేశ మాజీ మంత్రి బెర్నాడ్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, బెక్కం జనార్ధన్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ది విజయ్ కుమార్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, డాక్టర్ రాంమోహన్ రావు, జగప తిరావు, భూపతిరావు, కుర్మయ్య, ప్రమోద్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా..


రథాన్ని లాగుతున్న భక్తులు

దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు రథోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి కృష్ణాచారి, శ్రీనువాసాచారి పాల్గొన్నారు.

హన్వాడ : మండలంలోని హన్వాడ, నాయినోనిపల్లి గ్రామాల మధ్య వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా స్వామి వారు ప్రత్యేక పూజలు అందుకోగా, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది.

రాచాల చెన్నకేశవస్వామి ఉత్సవాలు...

మూసాపేట: అడ్డాకుల మండలం రాచాలలో చెన్నకేశవస్వామి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉద్దాల ఊరేగింపు కార్యకమం నిర్వహించారు. నియోజవకర్గ స్థాయి వాలీబాల్ పోటీలకు గాను 20 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం దాకా 10 జట్లకు పోటీలు నిర్వహించగా మిగతా వారికి గురువారం నిర్వహిస్తారు. ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతులను అందజేశారు. దేవాలయ ధర్మకర్త చెన్నారెడ్డి, మాజీ సర్పంచి తిరుపతయ్య, నర్సింహులు, రవీందర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, రాములు, బొక్క శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం.. కమనీయం


ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు


వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అశేష భక్త జనసంద్రంలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం భక్తి పారవశ్యంతో కమనీయంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలోని అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి రథోత్సవం (తేరు) మాఘ రథసప్తమి మంగళవారం రాత్రి ప్రారంభమై బుధవారం తెల్లవారు జామున ముగిసిం ది. ప్రతీ ఏటా రథోత్సవానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, వేద పండితులచే హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలోకి చేర్చారు. అనంతరం తేరుకు ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, ఈవో చిలుకూరు రంగారావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ జి.లావణ్యతో ఆలయ ప్రధాన అర్చకుడు కొరవి రామా నుజచార్యులు ప్రత్యేక పూజలు చేయించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. భక్తులకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి సొంత ఖర్చులతో అన్నదానం చేశారు. బుధవారం విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుతులను అందజేసినట్లు నిర్వాహకులు గాడి సురేందర్, కొంకలి మధు, ఉపాధ్యాయురాలు సూర్యకళ, వకుల తెలిపారు. అర్చకులు జయంత్, శుక్లా, చక్రపాణి ఆలయ కమిటీ మాజీ సభ్యులు సొప్పరి బాలస్వామి, గంధం వెంకటేశ్వర్లు, గాడి సురేందర్, సిబ్బంది శివకుమార్, బాబయ్య, వలంటీర్లు జగదీష్, కొంకలి మధు, కొంకలి లోకేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి శకటోత్సవం

● ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ



జడ్చర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శకటోత్సవం(బండ్లు తిప్పుట) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన రైతులతో పాటు పరిసర ప్రాంతానికి చెందిన వారితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ ఎడ్లతో బండ్లను తీసుకువచ్చి, దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శకటోత్సవం సందర్భంగా ఎడ్లబండ్లకు దేవతల చిత్రపటాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎడ్ల కొమ్ములకు రంగులు పూసి, ఎడ్లపై రంగులద్ది ముస్తాబు చేశారు. శకటోత్సవం సందర్భంగా జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల భాగంగా శకటోత్సవం సందర్భంగా శకటాలకు ఆలయ ఈవో దీప్తిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు సౌకర్యాలు, సదుపాయాలను ఈవో దీప్తిరెడ్డి, ఆలయ ట్రస్టీ సభ్యులు ఏర్పాటు చేశారు.


ఎడ్ల బండ్లను దేవాలయ ప్రధాన ద్వారం మెట్లను ఎక్కించిన భక్తులు

అసమర్థతతో తప్పు కాదు.. పద్ధతి ప్రకారం చేసిన తప్పు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్

మహబూబ్ నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ కులగణన అంకెలు, సంఖ్యలు గల నివేదిక ప్రకటనను వినగానే ఇది అసమర్థతతో చేసిన తప్పుకాదని, చాలా పద్ధతి ప్రకారం చేసిన తప్పు అని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ అన్నారు. దీన్ని బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ బీసీలను వంచించే కుట్ర చేస్తుందన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో 52 శాతం ఉన్న బీసీలు 2025లో 46 శాతానికి తగ్గడం, 9 శాతం ఉన్న అగ్రవర్ణ కులాలు 15 శాతానికి పెరగడం ఇది ఎలా సాధ్యమయ్యిందని ప్రశ్నించారు. 3 కోట్ల 92 లక్షలు ఉన్న బీసీలు 3 కోట్ల 50 లక్షలుగా తక్కువ చేసి చూపించడంలో ఆంతర్యమేమిటన్నారు. కులగణన నివేదిక బాధ్యత పొన్నం లాంటి బీసీ లకు ఇవ్వకుండా ఓసీ అయిన ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

స్థానిక సంస్థల ఎన్నికల పోరులో ఎలాగైన నెగ్గుకు రావాలన్న నెపంతోనే బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆయన మండిపడ్డారు. జనాభా తగ్గిస్తే బీసీలకు రిజర్వేషన్లు తగ్గించవచ్చనే కుట్రకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని ఆయన దుయ్యబట్టారు. బీసీ కులగణనలో ముస్లిం మతస్థులను ఎలా చేరుస్తారన్నారు. వారికి మతపరమైన రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు.

బీసీలు రాబోవు ఎన్నికల్లో ఇరుపార్టీలు అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలని, అందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు అచ్చుగట్ల అంజయ్య, నంబిరాజ్, కొౌకుంట్ల ఆంజనేయులు, పిల్లి సత్యనారాయణ, శ్రీకృష్ణ, నిరంజన్, మఠం మయూరి నాథ్, జెట్టం మహేశ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'పది' పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల అన్నారు. సింగారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన ప్రేరణ తరగతుల కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ, డీసీసీడీఓ, ఉమాపతి, బీసీ సంక్షేమశాఖ అధికారి ఖలీల్ తదితరులున్నారు.

నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నేతన్న పొదుపు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు డి.బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకం గడువు 24 నెలలుగా ప్రభుత్వం నిర్ణయించిందని, దరఖాస్తుదారులు ఆధార్ కార్డుతో పాటు బ్యాంక్ ఖాతా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 15 వరకు అందించాలని, వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మక్తల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, మాట్లాడారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో పోలీసులు బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసి 11 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ అంజనేయులు వాహనదారులకు పలు సూచనలు చేశారు.

ఇటుక బట్టీలను పరిశీలించిన విద్యార్థులు

కోస్గి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం ఇటుక బట్టీలను పరిశీలించారు. నాలుగో తరగతి విద్యార్థుల పాఠ్యాంశంలోని ఇటుకలు తయారుచేసే విధానాన్ని విద్యార్థులు స్వయంగా పరిశీలించారు. ఇటుకలు ఎలా తయారు చేస్తారు, ఎలా పేరుస్తారు తదితర అంశాలను పరిశీలించి అవగాహన పొందారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

దామరగిద్ద, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆదాయం పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం పై సంతోషం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాల్‌రావు, అధికార ప్రతినిధి వెంకటయ్యలు హాజరై, మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు బడ్జెట్‌లోని అంశాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖలీ, బీజేవైఎం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, మంగలి నారాయణ, వెంకటాములుగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, అశోక్ యాదవ్, హనుమంతు పాల్గొన్నారు.

చింతల్‌దిన్నెలో పశువైద్య శిబిరం

మద్దూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల్‌దిన్నె గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు, గేదెలకు గర్భకోశ, చూడి పరీక్షలు నిర్వహించారు. 14 ఆవులకు, 35 గేదెలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారులు విశాల, సవితతో పాటు సిబ్బంది అరుణ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ విజయ్, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు మధ్వనవమి వేడుకలు

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట రామచంద్ర స్వామి ఆలయంలో గురువారం మధ్వనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌శేషు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ఠ	కనిష్ఠ (రూపాయల్లో)
వేరుశనగ	1030.20	5,858	4,005
ఆలసందలు	0.49	6,666	6,666
ఎర్ర కందులు	346.92	7,250	6,080
తెల్ల కందులు	60.76	7,512	6,419

ప్రజా కార్మిక వ్యతిరేక బడ్జెట్

- ప్రజా సంఘాల విమర్శ
- పేట, మక్తల్‌లో నాయకుల నిరసన


పేట అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నారాయణపేట/మక్తల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సమస్యలకు పరిష్కార మార్గం చూపించకుండా తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, మాస్‌లైన్ జిల్లా నాయకుడు కాశీనాథ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌లు విమర్శించారు. బుధవారం పేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ప్రసంగించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మడానికి సులువు చేసిందన్నారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతించడంలో బీజేపీ నాయకుల దేశభక్తి ఎక్కడుందన్నారు. కొంతమంది కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టడానికి ఈ బడ్జెట్‌ను తయారు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బాల్‌రామ్, సలీం, ప్రశాంత్, యాదగిరి, నారాయణ, వెంకట్రాములు, హాజి, నరహరి, మోహన్, పవన్, రాములు, మజూర్ ఉన్నారు.

అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఏఐటీయూసీ నాయకులు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు టీనర్సింహులు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. తమశక్తిని ధారపోస్తు దేశ సంపదను పెంచుతున్న కార్మికులను విస్మరించడం దారుణం అన్నారు. కోట్ల మంది కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి పథకాలను విస్మరించారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న ఆహార ధాన్యాలు బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదన్నారు. శివయ్య, మణెమ్మ, చంద్రమ్మ, మల్లమ్మ, కేశవ తదితరులు పాల్గొన్నారు.


మక్తల్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి

- జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి


పేట జడ్పీ కార్యాలయంలో ఎంపీడీవోలతో సమావేశమైన జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎంపీడీవోలు సిద్ధంగా ఉండాలని జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం పేట జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలతో ఆమె సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల పరిధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా అందుకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేసుకొని ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అధికారుల అవసరం, బ్యాలెట్ బాక్స్‌ల అవసరం తదితర అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో జ్యోతి, సూపరింటెండెంట్ రాంచందర్ రావు తదితరులున్నారు.

ప్రజలకు సమ న్యాయం చేసేందుకే కులగణన


సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం చేసేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టి శాసనసభలో బిల్లు పెట్టిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద పార్టీ నాయకులతో కలిసి బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికి దిక్సూచిలా మారిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం చేసే వేలు చేసేందుకే కులగణన చేపట్టిందన్నారు. పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టిన కులగణనపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం అవివేకమన్నారు. గతంలో బీఆర్ఎస్ నిర్వహించిన సమగ్ర సర్వే ఆనవాళ్లు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌కుమార్, గోపాల్, నారాయణ, శ్రీనివాస్, గోవర్ధన్, హన్మంతు, నాగేష్, అంజనేయులు ఉన్నారు.


మరికల్‌లో కుర్వ కులస్తులపై బండారు చల్లుతున్న బంధువులు


చెన్వారెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామ దేవత ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా ఎల్లమ్మ బండారు మహోత్సవం

- ఊట్కూర్, మరికల్‌లో వేలాదిగా తరలివచ్చిన వివిధ గ్రామాల భక్తులు

ఊట్కూర్/మరికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఐదేళ్లకోసారి జరిగే వీర లింగేశ్వరస్వామి బండారు మహోత్సవాలను ఊట్కూర్ మండల కేంద్రంతో పాటు, మరికల్‌లో మాదాసి కుర్వ కులస్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఊట్కూర్‌లో వీరప్ప బండారు మహోత్సవం అనంతరం మండల కేంద్రంలో బుధవారం మాదాసి కురువల ఎల్లమ్మ తల్లి బండారు మహోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం జనాలతో కిటకిటలాడింది. ఉదయం ఊరి బయటి గుడి వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు ఎల్లమ్మ తల్లికి పూజలు చేసిన నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం గుడి వద్ద హోమం నిర్వహించి భక్తులందరికి అన్నదానం చేశారు. ఊట్కూర్ గ్రామ బీరప్పను ఇంటి దేవుడిగా కొలిచే వారు కుటుంబ సమేతంగా బండారు మహోత్సవంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వరుస క్రమంలో కుర్వలపై బండారు పసుపును చల్లి ఆశీర్వదించారు. బండారు మహోత్సవంతో ఆలయ ప్రాంగణమంతా పసుపు మయంగా మారింది. కాంగ్రెస్ నాయకుడు దేవరి మల్లప్ప, ఎల్కోటి నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, కుర్వ కుల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అదేవిధంగా మరికల్ మండల కేంద్రంలోని మాదాసి కుర్వ కులస్తులు బుధవారం ఎల్లమ్మ బండారు ఉత్సవాలను జరుపుకున్నారు. స్థానిక బీరప్ప దేవాలయం ఆవరణలో ఎల్లమ్మదేవత పట్నం వేసి మొక్కుబడులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కుల బంధువులు వివిధ గ్రామాలు, జిల్లాల నుంచి వచ్చిన కుర్వ సోదరులతో జనసంద్రంగా మారి పసుపుమయంతో శోభాయమానంగా వెలసింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీష్, రాములు, మల్లేష్, రామకృష్ణ, బ్రిజన్, రఘు, కృష్ణయ్య తదితరులున్నారు.

చెన్వారెడ్డిపల్లిలో గ్రామ దేవత ఉత్సవాలు

మద్దూర్ : మండలంలోని చెన్వారెడ్డిపల్లిలో గ్రామ దేవత గజ్జలమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గజ్జలమ్మ దేవాలయానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఊరేగించారు. ఆలయంలో గ్రామీణ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ధన్వాడలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

ధన్వాడ : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బొడ్రాయిని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విష్ణు సహస్ర పారాయణం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ

- జిల్లాలో 45,717 మంది రైతుల ఖాతాల్లో రూ.26,94,06,432 విడుదల
- ఎంపిక చేసిన 13 గ్రామాల్లో 9,348 మంది రైతులకు రూ.13.87 కోట్లు అందజేత

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగుకు సహాయంగా అర్హులైన జిల్లా రైతాంగానికి బుధవారం ఎకరా ఉన్న 45,717 మంది రైతుల ఖాతాలో రూ.26,94,06,432 రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఇదివరకే ప్రభుత్వం ముందుగా మండలంలో ఓ గ్రామం, జిల్లాలోని 13 గ్రామాలకు రైతు భరోసాను మొదటి విడతలో ఎకరాకు రూ.6వేల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 9,348 మంది రైతులకు రూ.13.87 కోట్లు రైతాంగం ఖాతాల్లో ప్రభుత్వం వేసింది. ఇంకా జిల్లా వ్యాప్తంగా 1,38,955 మంది రైతు లకు రూ.235 కోట్లు రైతు భరోసా అందాల్సి ఉంది.

బీసీలను తక్కువ చూపించడం ఓ కుట్ర

మద్దూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కులగణనలో బీసీలను తక్కువ శాతం చూపించడం ఓ కుట్ర అని బీఆర్ఎస్ మండల నాయకులు ఆరోపించారు. బుధవారం మద్దూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకుడు నీలి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన తప్పుల తడకగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన సకల జనుల సమగ్ర సర్వే సరైనదన్నారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా అవకాశాలు తగ్గించే విధంగా కులగణన ఉందని, దీనివల్ల వారికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. బాల్‌చెందర్, సాయిలు, వెంకటేశ్ ఉన్నారు.

భూమి లేని రైతులందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భూమిలేని రైతులందరికీ సంవత్సరానికి రూ.12 వేలు అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం అన్నారు. స్థానిక భగత్‌సింగ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ఉపాధి అవకాశాలు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారని, వలసలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు జి.వెంకట్రాములు, చెన్నప్ప, హాజిమల్లంగ్, కనకరాయుడు, రాజుతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దామరగిద్ద, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చేతుల మీదుగా 133 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కృష్ణానది జలాల్లో నీటి వాటాపై నేడు రౌండు టేబుల్ సమావేశం

మరికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది జలాలపై జిల్లాకు దక్కాల్సిన నీటి వాటాలో జరుగుతున్న అన్యాయంపై గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని ఉమ్మడి పాలమూరు అధ్యయన వేదిక నాయకులు వెంకట్రాములు, సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వాసవి మండలి భవనంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యువత, మండలి సభ్యులు హాజరై, సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

9న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

మక్తల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలో ఈనెల తొమ్మిదిన మట్టి రోడ్డు పై జిల్లా స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నామని జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులకు, 23 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలకు వేర్వేరుగా మట్టిరోడ్డుపై మౌంటెన్ సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి ఈనెలాఖరులో శ్రీశైలంలో ఏర్పాటు చేసిన జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తమ స్వంత సైకిల్, బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. పీఈటీలు అంజిత్, దామోదర్, రమేష్ కుమార్ ఉన్నారు.

10న కొస్గికి కేటీఆర్ రాక

కోస్గి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతు దీక్షకు మద్దతుగా ఈనెల 10న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోస్గికి రానున్నారని ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. కోస్గి, గుండుమాల్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

పేటలో సినిమా షూటింగ్


పేటలోని బారంబావి చింత చెట్టు దగ్గర కొనసాగుతున్న సినిమా చిత్రీకరణ

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రాజుగారు రాజయ్యారు' పేరుతో తెలంగాణ నేపథ్యంతో కుటుంబకథా చిత్రాన్ని బుధవారం నారాయణపేటలోని పలు ప్రాంతాల్లో సన్నివేశాలు చిత్రీకరించారు. పట్టణంలోని బారంబావి, కుమ్మరివాడ, వక్ల, సరాఫ్‌బజార్, బాహర్‌పేట చేనేత కార్మికుల మగ్గాలు, తదితర ప్రాంతాల్లో సన్నివేశాలను చిత్రీకరించారు. శర్వన్యూ పిలిమ్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అల్లాపహస్సన్ దర్శకత్వంలో అనుశ్రీ, అల్లాపహస్సన్ హీరోహీరోయిన్లుగా రాజుగారు రాజయ్యారు సినిమా షూటింగ్ తీశారు. చిత్ర దర్శకుడు అల్లాపహస్సన్, సెన్సార్ బోర్డు సభ్యుడు రంగయ్య మాట్లాడుతూ 90 శాతం చిత్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పూర్తయిందని త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. షూటింగ్‌కు సహకరించిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కెమెరామెన్, చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

దామరగిద్ద, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు కందులు విక్రయించి లాభాలు పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ షెట్టి ఈదప్పతో కలిసి శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 అందిస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ షెట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, శరణోనాయక్, తమ్మలి రఘు, ఓంప్రకాష్, మురారి, రైతులు పాల్గొన్నారు.

మొక్కలను కాల్చితే కఠిన చర్యలు : ఎంపీడీవో

ఊట్కూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హరితహారం, వన మహోత్సవంలో భాగంగా రోడ్డు వెంట పెంచిన మొక్కలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ధనుంజయ్ గౌడ్ అన్నారు. బుధవారం ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై ఏపీవో సత్యప్రకాష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, భవిష్యత్‌లో చేయాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్లు రహదారి వెంట మొక్కలను సంరక్షించాలన్నారు. వేసవిలో కూలీలు అందుబాటులో ఉండేలా అన్ని పనులపై అంచనాలు వేయించుకుని మంజూరు చేయించుకోవాలన్నారు. ఎంపీవో లక్ష్మీనరసింహరాజు, ఈసీ మహిపాల్, సాంకేతిక సహాయకులు మనిషా, మహాలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్లు చంద్రశేఖర్, సాహిత్యతేజం, క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- ఎంఈవో కృష్ణారెడ్డి

దామరగిద్ద, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దెలబీడ్ ఎంపీపీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటకు ఉపయోగించే బియ్యాన్ని, ఇతర వంట సరుకులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఆర్ఎం

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఆర్టీసీ డిపోను మహబూబ్‌నగర్ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ తనిఖీ చేశారు. డిపోలోని ఆయిల్, మెకానిక్, స్టోర్స్ తదితర సెక్షన్లను పరిశీలించారు. అనంతరం బస్టాండ్‌తో పాటు, పరిసరాలు పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో ప్రైవేటు వాహనాలు నిలుపకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ లావణ్యకు సూచించారు. సీఐ అలివేలు, సూపరింటెండెంట్ నరేందర్, అంజనేయులు, ఎం.ఎం.రెడ్డి, వహీద్, రవికుమార్ ఉన్నారు.

అనంతసేన ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట పళ్ల ప్రాంతంలోని అనంత సేన దేవాలయంలో ఆర్ఎం సంతోష్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీఎం లావణ్య ఉన్నారు.

శక్తిపీఠాన్ని సందర్శించిన లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్

నారాయణపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శక్తిపీఠాన్ని బుధవారం లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.కోటేశ్వర్‌రావు సందర్శించారు. మహాలక్ష్మి దేవత పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సురభి గోశాల, నిత్యాన్నదాన కార్యక్రమాలను పరిశీలించారు. స్వామి కాంతానంద శక్తిపీఠం కార్యక్రమాలను వివరించారు. అశోక్‌కుమార్, గోపాలకృష్ణ, మల్లేష్‌గౌడ్, సంజీవరెడ్డి, గండె రవికాంత్, అరకంటి రవి, సుదర్శన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, నారాయణగౌడ్, షేర్ కృష్ణారెడ్డి, శ్రీను ఉన్నారు.

ఘనంగా శివ మహా పడిపూజ

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ శివాలయంలో శివ మహా పడిపూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు రాజుస్వామి, పవన్‌స్వామిల ఆధ్వర్యంలో పడిపూజ, రుద్రాభిషేకం, భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శివ స్వాములు, గ్రామపెద్దలు, మహిళలు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పంపిస్తున్నారు.

ప్యాట ఈశ్వరాలయంలో...

మాగనూర్ : మండల కేంద్రంలోని ప్యాట ఈశ్వరాలయంలో రెండవ ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో మెట్ల పూజ, లింగాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివస్వాములు, భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు సంఘన బసవ, జైపాల్‌రెడ్డి, మురళి, దేవాలయ పూజారి ప్రవీణ్, మహదేవ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సరిత, మాజీ ఎంపీపీ శ్యామలమ్మ, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాకిటి శ్రీనివాసులు, బెట్టరు హెడ్మాస్టర్ యాదుకుమారయ్య, వివిధ గ్రామాల శివస్వాములు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంఈవో



రగ్బీ క్రీడా విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో బాలకిష్టప్ప

మద్దూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలతో రాణించాలని ఎంఈవో బాలకిష్టప్ప అన్నారు. ఈనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు మంచిర్యాలలో జరిగిన రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన మద్దూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించి, మాట్లాడారు. హెచ్ఎం సవిత, పీఈటీ డైరెక్టర్ వెంకటప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.